## క్లుప్తంగా

### ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

నల్లగొండ టౌన్ : వాణిజ్య దుకాణాల యాజమానులకు, ఫంక్షన్ హాల్స్, వివిధ మోటర్ వాహనాల షోరూంల యాజమానులకు మున్సిపల్ కమిషనర్ పేరుతో అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్ కాల్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7780110865 నంబర్‌తో గుర్తు తెలియని వ్యక్తి కమిషనర్‌ను మాట్లాడుతున్నానని ఫోన్లు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు, ఎవరు కూడా అతడికి డబ్బులు ఇవ్వొద్దన్నారు. ఫోన్ చేస్తున్న వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు.

### ‘త్రిఫ్ట్’లో చేరేందుకు గడువు పొడిగించాలని వినతి

నల్లగొండ టౌన్ : అర్హులైన ప్రతి పేద నేత కార్మికుడు త్రిఫ్ట్ ఫండ్ పథకంలో చేరేందుకు నెల రోజుల పాటు గడువు పొడిగించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, చెరుపల్లి జయప్రకాష్‌లు గురువారం జౌళిశాఖ సహాయ సంచాలకులు ద్వారక్‌కు వినతిపత్రం అందజేశారు. వారివెంట గంజి రాజేందర్, గంజి లక్ష్మీనారాయణ, మూడ వేణు, మిర్యాల కిరణ్ ఉన్నారు.

### నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ అంజయ్య

కట్టంగూర్ : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులకు గురువారం ఎంఈఓ అంబటి అంజయ్య నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి గుజ్జుల శంకర్‌రెడ్డి, సిబ్బంది వెంకట్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

### లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలి

నార్కట్‌పల్లి : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా ఉండాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నార్కట్‌పల్లిలో చెరుకు పెద్దులు అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయన్న, దండు రవి, కట్ట రామచంద్రం, భగవంతరెడ్డి, కల్లూరి కంట్ల మహేశ్వరం, బొల్లెద్దు సైదులు పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

శాలిగౌరారం: మండలంలోని భైరవునిబండ గ్రామానికి చెందిన దండ సోమిరెడ్డికి మంజూరైన రూ, లక్ష రూపాయల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును గురువారం స్థానిక మాజీ సర్పంచ్ దండ రేణుకఅశోక్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పడాల శంకర్, గౌస్, శ్యామ్, వెంకట్‌రెడ్డి, జయమ్మ, పూలమ్మ, సరోజనమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

### శిక్షణ తరగతుల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నకిరేకల్ : కట్టంగూర్ మండల కేంద్రంలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్న కేవీపీఎస్ జిల్లాస్థాయి శిక్షణ తరగతులకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను నకిరేకల్‌లో గురువారం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వంటిపాక కృష్ణ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి శిక్షణ తరగతుల్లో 200 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, తాజేశ్వర్, మల్లయ్య, భాస్కర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ చిన్నారులకు పలకల పంపిణీ

నార్కట్‌పల్లి : కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా నార్కట్‌పల్లి మండలంలోని నక్కలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం యువజన కాంగ్రెస్ నార్కట్‌పల్లి మండల అధ్యక్షుడు పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పల్లగొర్ల ఆకాష్, శ్రీపతి తరుణ్, చిలుకూరి బన్నీ, చరణ్, శివరాం పాల్గొన్నారు.



పలకలతో చిన్నారులు

# రైతుల ఖాతాల్లో వడ్డీ రాయితీ జమ

- వ్యవసాయ పెట్టుబడికి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న రైతులు
- సక్రమంగా చెల్లించినవారికి తన వాటా రాయితీ చెల్లించిన కేంద్రం

మునుగోడు: వ్యవసాయ పెట్టుబడి కోసం బ్యాంకుల నుంచి రైతులు తీసుకున్న రుణాలకు సంబంధించి వడ్డీ రాయితీ రైతులు ఖాతాల్లో జమయ్యాయి. దీంతో మునుగోడు మండలంలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు ప్రభుత్వ అనుసంధాన బ్యాంకులు రైతులకు పెట్టుబడి రుణాలు అందజేస్తారు. తీసుకున్న పంట రుణాలు సక్రమంగా చెల్లించిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డీ రాయితీ అందజేస్తాయి.

**కేంద్రం వాటా మూడు శాతం..**

రైతులు తీసుకున్న పంట రుణాలకు బ్యాంకుల ద్వారా ఏడు శాతం వడ్డీ వసూలు చేస్తున్నారు. అలా వసూలు చేసిన వడ్డీలో 4 శాతం రాష్ట్ర ప్రభుత్వానికి, 3 శాతం కేంద్ర ప్రభుత్వానికి అందుతాయి. అయితే ఆ పూర్తిస్థాయి వడ్డీని గతంలో రాష్ట్రం, కేంద్రం రెండు కలిపి రైతులకు తిరిగి ఇచ్చేవి. 2009 వరకు రైతులు తీసుకున్న పంట రుణాలు తిరిగి ఏడాది లోపు చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి నూరుశాతం వడ్డీ రాయితీ తిరిగి ఇచ్చేవి. కానీ కొంతకాలంగా కేవలం కేంద్ర ప్రభుత్వం మాత్రమే అది కూడా రెండు, మూడు సంవత్సరాలకు ఒకమారు చెల్లిస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రుణాలు పొంది ఏడాది లోపు చెల్లించిన రైతులకు కేంద్రం వడ్డీ రాయితీ మంజూరు చేసింది.



మునుగోడు పీఏసీఎస్ కార్యాలయం

**మునుగోడు సహకార బ్యాంక్‌లో 400 మందికి రాయితీ..**

మునుగోడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో మొత్తం 8305 మంది సభ్యులు ఉన్నారు. అందులో 698 మంది రైతులు రూ.5.73 కోట్లు పంట రుణాలు తీసుకున్నారు. అందులో 400 మంది రైతులు ఏడాది లోపు రుణాలు చెల్లించి తిరిగి పొందడంతో వారందరికీ కేంద్ర ప్రభుత్వ వడ్డీ రాయితీ 3 శాతం రూ.8. 91 లక్షలు మంజూరు చేసింది. ఆ నగదును బ్యాంక్ సిబ్బంది రైతుల ఖాతాల్లో జమచేశారు.

### నా ఖాతాలో నగదు జమచేశారు



నేను మునుగోడు సహకార సంఘంలో రూ.లక్ష వ్యవసాయ రుణం తీసుకున్నా. ఆ రుణం సకాలంలో చెల్లించడంతో నాకు రూ. 3600 వడ్డీ రాయితీ వచ్చింది. ఆ నగదును బ్యాంకు అధికారులు నా ఖాతాలో జమచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మిగిలిన నాలుగు శాతం రాయితీ ఇస్తే బాగుండు.

– మునుగోటి కిరణ్, రైతు కొరటికల్

### 400 మందికి రాయితీ వచ్చింది



మా బ్యాంక్‌లో మొత్తం 8305 మంది రైతులు ఉండగా అందులో 698 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. అందులో సకాలంలో వడ్డీ చెల్లించిన 400 మంది రైతులకు 2023–24 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం అందించే 3 శాతం వడ్డీ రాయితీ మొత్తం రూ. 8.91 వచ్చింది. ఆ నగదును రైతుల ఖాతాల్లో జమచేశాం.

– పి. సుఖేందర్, సీఈఓ

# విలువలతో కూడిన రాజకీయాలు చేద్దాం



మునుగోడు : మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి



మునుగోడు : పలివెల గ్రామంలో వృద్ధురాలి సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు : విలువలతో కూడిన రాజకీయం చేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో గురువారం నాంపల్లి మండల ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరం ఏకమై మునుగోడు నియోజకవర్గంలో అన్ని స్థానాలు క్లీన్ స్వీప్ చేయాలన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని సమస్యల పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. ప్రతి గ్రామంలో నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పేదలకు అండగా ఉంటా**

అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం మునుగోడు మండలం పలివెల గ్రామాన్ని ఎమ్మెల్యే సందర్శించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సీసీ రోడ్లతోపాటు డ్రెయినేజీలు నిర్మించాల్సిన ప్రాంతాలు, ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను, ఊకొండి, చీకటిమామిడి వెళ్లే రహదారులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు తన తల్లి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద మెమోంటో అందజేస్తామన్నారు. పలివెల గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో కొత్తగా పింఛన్లు మంజూరు చేయాల్సిన వారి జాబితా సిద్ధం చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను నిర్మూలించిన తర్వాత పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయని మహిళలను అడిగి తెలుసుకున్నారు.

**కాంగ్రెస్ పార్టీలో చేరిక**

నాంపల్లి : మండలంలోని జాన్‌తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు గురువారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎరెడ్ల రఘుపతిరెడ్డి, పూల వెంకటయ్య, పానగంటి వెంకన్నగౌడ్, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

నల్లగొండ టౌన్ : తమకు రావాల్సిన ఐదు నెలల వేతనాలతోపాటు పీఎఫ్ వెంటనే జమ చేయాలని డిమాండ్ చేస్తూ మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఎదుట శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు గురువారం పనులను నిలిపివేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్ ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్ కూడా సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపించారు. సమాచారం అందుకున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి ఎంసీహెచ్‌కు చేరుకుని ధర్నా చేస్తున్న వారితో మాట్లాడారు. వేతనాలు ప్రతినెలా ఒకటో తేదీన ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో శానిటేషన్, సెక్యూరిటీ గార్డు, పేషెంట్ కేర్ కార్మికులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న శానిటేషన్ సిబ్బంది

### జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



కందికంటి శివాని



దోరెపల్లి బన్నీ

నకిరేకల్ : పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్న కందికంటి శివాని, మంగళపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పూర్తిచేసిన దోరెపల్లి బన్నీ హ్యాండ్‌బాల్ జూనియర్ విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు మంగళపల్లిలో జరిగిన 47వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల హ్యాండ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, మంగళపల్లి హైస్కూల్ హెచ్‌ఎం కర్ర వీరారెడ్డి, పీఈటీ చైతన్యకుమార్ గురువారం తెలిపారు. విద్యార్థులు తెలంగాణ జట్టు తరఫున ఈ నెల 18 నుంచి 23 వరకు బిహార్ రాష్ట్రంలోని నవాడలో జరుగుతున్న జాతీయస్థాయి జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

### 30న ఆత్మ గౌరవ సభ

నల్లగొండ అగ్రికల్చర్ : హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న యాదవ ఆత్మ గౌరవ సభను జయప్రదం చేయాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ముచ్చెర్ల ఏడుకొండల్ కోరారు. గురువారం నల్లగొండ పట్టణంలోని యాదవ భవన్‌లో సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిత్యం యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



కట్టంగూర్ : యోగా చేస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య సిబ్బంది

కట్టంగూర్ : నిత్యం యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆయుష్ డిస్పెన్సరీ విభాగం వైద్యాధికారి ఊర్మిళ అన్నారు. 11వ యోగా మాసోత్సవాల్లో భాగంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో గురువారం కట్టంగూర్ మండలానికి చెందిన (నార్కట్‌పల్లిలో నిర్వహిస్తున్న) సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా ఆనందంగా ఉండాలంటే యోగా ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శమంత, ఫార్మసిస్ట్ ఉమారాణి, యోగా ఇన్‌స్ట్రక్టర్ శరత్, నిర్మల ఉన్నారు.

తిప్పర్తి : యోగా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఆయుష్ డాక్టర్లు అరుణ, యూనుస్ అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా మాడ్గులపల్లి ఆయుష్ డిస్పెన్సరీ ఆధ్వర్యంలో తిప్పర్తి మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు యోగా గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని, మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. ఆహార నియమాలు పాటించాలని, చదువు పట్ల ధ్యాస కలిగేందుకు ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేశ మార్గదర్శకుడు రాహుల్ గాంధీ

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: రేపటి తరానికి మార్గదర్శకుడు రాహుల్ గాంధీ అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని మెయిన్ సెంటర్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం కేక్ కట్ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య, లింగాల వెంకన్న, పన్నాల రాఘవరెడ్డి, గాదగోని కొండయ్య, కంపసాటి శ్రీనివాస్, కొండ వెంకన్న, బ్రహ్మదేవర రమేష్, ఉగ్గిడి శ్రీనివాస్, నారాయణ, రవి, వెంకన్న, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**ఆస్పత్రిలో పండ్లు పంపిణీ**

నల్లగొండ టౌన్ : రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం యూత్ కాంగ్రెస్ నాయకులు నల్లగొండలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నల్లగొండ నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి కార్తీక్, గాలి నాగరాజు, కంచర్ల ఆనంద్‌రెడ్డి, పాదం అనిల్‌కుమార్, కత్తుల కోటి, సిద్ధార్థ, పవన్‌కళ్యాణ్, పరుశరాం, రంజిత్, పృథ్వీ, రాజేష్, చిట్టి, నాగరాజు, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం శాలిగౌరారంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాహుల్‌గాంధీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేశ్, నోముల జనార్దన్, రవి, గూని వెంకటయ్య, అల్లి సైదులు, పెరుమాండ్ల నరేశ్, దొంతూరి రామచంద్రయ్య, కడారి అంజయ్య, నక్క మల్లేష్, దేవేందర్, వీరయ్య, మహేశ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

గట్టుప్పల్ : మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునుగోడు మండల యూత్ ఉపాధ్యక్షుడు బాలం మహేష్, గట్టుప్పల పట్టణ అధ్యక్షుడు పగిళ్ల ఆది, పున్న శివ, మహమ్మద్ అబ్బాస్, మొద్దు గణేశ్, భీమగాని శివ, ఎర్ర కుమార్, మొద్దు నవీన్, పగిళ్ల రమేష్, పగిళ్ల గణేశ్, ఖమ్మం రాంబాబు, వావిళ్ల వంశీ, నల్లవెల్లి కృష్ణయ్య, చంద్రశేఖర్, వీరేశం పాల్గొన్నారు.

# సొంతంగా రోడ్డు గుంతలు పూడ్చుకున్న గ్రామస్తులు

శాలిగౌరారం: ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురుచూడకుండా గ్రామస్తులే చందాలు వసూలు చేసుకుని తమ సొంత ఖర్చులతో గ్రామానికి ఉన్న మట్టిరోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చుకున్నారు. శాలిగౌరారం మండలంలోని బండమీదిగూడెం గ్రామానికి ఊట్కూరు మీదుగా మట్టిరోడ్డు మార్గం ఉంది. ఈ రోడ్డు దశాబ్ద కాలానికిపైగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో రోడ్డు మొత్తం భారీ గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని దుస్థితికి చేరుకుంది. బండమీదిగూడెంతోపాటూ గ్రామపంచాయతీ పరిధిలోని అన్నెబోయినగూడెం, మెట్టుగూడెం గ్రామాల ప్రజలు ఈ రోడ్డుపై రాకపోకలు కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డును బాగు చేయాలని పాలకులకు, అధికారులకు బండమీదిగూడెం గ్రామపంచాయతీ ప్రజలు దశాబ్ద కాలంగా మొరపెట్టుకుంటూ వస్తున్నారు. కానీ నేటికీ ప్రజల మొరను ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడంతో గ్రామస్తులే రోడ్డును బాగు చేసుకునేందుకు నడుం బిగించారు. అందుకు గ్రామానికి చెందిన యువకులు ముందు నడిచి చందాలు వేసుకుంటుండగా ప్రజలు కూడా తమవంతు సహకరించి రోడ్డు బాగుకోసం చందాలు ఇచ్చారు. దీంతో సుమారు రూ.25 వేల వ్యయంతో 30 ట్రాక్టర్లకు పైగా మట్టిని రోడ్డుపై గుంతల్లో పోసి చదును చేశారు.



బండమీదిగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతల్లో మట్టి పోస్తున్న గ్రామస్తులు

### జాతర బ్రోచర్ విడుదల



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్ సమీపంలో కట్టమైసమ్మ గుడి వద్ద ఈ నెల 26న నిర్వహించే కుమ్మర్ల తొలిబోనం జాతరలో జిల్లాలోని కుమ్మర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కుమ్మరి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండ పట్టణంలోని సంఘం కార్యాలయంలో జాతర బ్రోచర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆమంచి రాజలింగం, ఏడుకొండల వెంకటేశం, రాధారపు భిక్షపతి, గంగాధరపు వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, రమేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నిమ్మనగోటి శాంప్రసాద్ పాల్గొన్నారు.

### పాఠశాలల తనిఖీ

తిప్పర్తి : ప్రభుత్వ పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తిప్పర్తి మండల ప్రత్యేక అధికారి ఛాయాదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూరిబా, ఆదర్శ పాఠశాల, ఉన్నత పాఠశాల, బాలికల పాఠశాలలను ఆమె పరిశీలించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టాయిలెట్లు ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని, మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నర్సింహస్వామి ఉన్నారు.



ఆదర్శ పాఠశాలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

### పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

నల్లగొండ టౌన్ : బెస్ట్ అవైలబుల్ స్కీం పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరుతూ గురువారం కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు పాలడుగు నాగార్జున, ఖమ్మంపాటి శంకర్, మల్లం మహేష్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు ఏడు కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులు ఉన్నాయని, వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొండేటి శ్రీను, ఆకారపు నరేష్, గుండాల నరేష్, రవీందర్, నర్సింహ, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

# ఇజ్రాయిల్ ప్రధాని దిష్టిబొమ్మ దహనం

నల్లగొండ టౌన్ : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ గురువారం స్థానిక సుభాష్ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఇజ్రాయిల్ ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ పాలస్తీనాపై దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పబ్బు వీరస్వామి, కర్ర సైదిరెడ్డి, జిల్లా యాదయ్య, పాటెం వెంకట్రావ్, మదార్, గుండె రవి, యూసూఫ్, జాని, వెంకన్న సీతారాము, చాంద్, సర్దార్, విజయ, సుజాత, మాధవి, హైమావతి, విజయరెడ్డి, నరేందర్ పాల్గొన్నారు.

**పాలస్తీనాపై దాడులను ఖండించాలి**

పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను నిరసిస్తూ సీపీఎం నాయకులు గురువారం స్థానిక సుభాష్ విగ్రహం వద్ద నల్లజెండాలతో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నాయకులు నారి అయిలయ్య, లక్ష్మీనారాయణ, దండెంపల్లి సత్తయ్య, ఎండీ సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, మల్లం మహేష్, ఖమ్మంపాటి శంకర్, ఆకారం నరేష్, నలపరాజు సైదులు తుమ్మల పద్మ, దండెంపల్లి సరోజ, అద్దంకి నర్సింహ, కోట్ల అశోక్‌రెడ్డి, రవీందర్, సైదాచారి, కిరణ్, యాదయ్య, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, ప్రభు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

### బీజేపీ పాలనలోనే పేదలకు న్యాయం

గట్టుప్పల్ : బీజేపీ పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం అన్నారు. గట్టుప్పల్ మండల కేంద్రంలోని మహారాజుల కాలనీలో గురువారం జరిగిన సంకల్ప సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ సారథ్యంలో చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు రావుల ఎల్లప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల నాయకులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

# బంద్‌ను విజయవంతం చేయాలి

కేతేపల్లి : ఉపాధి హామీ చట్టం రక్షణకు జూలై 9న జరిగే దేశవ్యాప్త హర్తాల్ గ్రామీణ బంద్‌లో ఉపాధి హామీ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య పిలుపునిచ్చారు. కేతేపల్లి మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, పంటలకు కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేసి కనీస వేతనం అమలు చేయాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి లూర్దు, మండల కార్యదర్శి చెవుగోని నాగయ్య, వీరబోయిన సోడయ్య, ఎడ్ల సైదయ్య, నాగయ్య, దుర్గయ్య, మల్లయ్య, సుజాత పాల్గొన్నారు.

### లీలమ్మ చిత్రపటానికి ఎంపీ నివాళి



నివాళులర్పిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన గంట్ల లక్ష్మారెడ్డి భార్య లీలమ్మ(80) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. గురువారం ఆ గ్రామంలో లీలమ్మ చిత్రపటానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, చిట్యాల, పెద్దకాపర్తి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జడల చినమల్లయ్య, నీలకంఠం లింగస్వామి, నాయకులు దుబ్బాక గోపాల్‌రెడ్డి, గంట్ల విజయ్‌కుమార్ రెడ్డి, కాటం వెంకటేశం, అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, చామల అనిల్‌రెడ్డి, ఏర్పుల నర్సింహ, గుండెపురి తిరుమలేష్, కొత్త సాయి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# ఎంపీడీఓ కార్యాలయంలో సినిమా షూటింగ్



ఎంపీడీఓ కార్యాలయం వద్ద సినిమా షూటింగ్

మర్రిగూడ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సినిమా షూటింగ్ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల నేపథ్యం, సర్పంచ్‌ల పనితీరుపై ఈ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నామని దర్శకుడు సురిగి వెంకటేష్‌గౌడ్ తెలిపారు. సినిమా రెగ్యులర్ షూటింగ్ మర్రిగూడ మండలంలో మరో నెల రోజులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సినిమా చిత్రీకరణ చూసేందుకు ఇరుగుపొరుగు గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.

### ఫాంపాండ్ నిర్మాణ పనుల పరిశీలన

నార్కట్‌పల్లి : మండలంలోని ఏపీ లింగోటం గ్రామంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఫాంపాండ్ పనులను సెంట్రల్ వాటర్ కమిషనర్ ఆనందబాబు గురువారం పరిశీలించారు. ఆయనవెంట అడిషనల్ డీఆర్‌డీఓ నవీన్, ఎంపీడీఓ ఉమేష్, ఎంపీఓ యాదగిరి, ఈసీ రాంబాబు ఉన్నారు.



ఫాంపాండ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

### ఉచిత వైద్యం అందించాలి

కట్టంగూర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున కోరారు. గురువారం కట్టంగూర్ మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 22, 23 తేదీల్లో కట్టంగూర్ మండల కేంద్రంలో జరిగే శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంటిపాక కృష్ణ, మండల కార్యదర్శి చిలుముల రామస్వామి, సీఐటీయూ జిల్లా నాయకులు పెంజర్ల సైదులు, రాజేష్, సైదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. శిథిల భవనాలు.. అరకొర వసతులు.. తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరత.. వెరసి అనేక సమస్యలతో బడులు కునారిల్లుతున్నాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిగా లేక విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. మధ్యాహ్న భోజనం తయారీకి వంట గదులులేక ఆరు బయట చేయాల్సిన దుస్థితి నెలకొంది. సరిపడా గదులు లేక చెట్లకిందే భోజనం చేయడమేకాకుండా చదువులు కొనసాగించాల్సి వస్తోంది. చాలా చోట్ల ఉపాధ్యాయులు ఉన్నా విద్యార్థులు లేక స్కూళ్లు మూతపడ్డాయి. మన ఊరు– మనబడి పథకం కింద చేపట్టిన పనులు కూడా అసంపూర్తిగానే మిగిలిపోయాయి. గురువారం 'సాక్షి' విజిట్‌లో పలు సమస్యలు వెలుగు చూశాయి.

# సర్కారు బడి.. సమస్యల ఒడి

**అస్తవ్యస్తంగా ప్రభుత్వ పాఠశాలలు**

- అరకొర వసతులతో ఆరుబయటే చదువులు
- తగినన్ని మరుగుదొడ్ల లేక పాట్లు
- విద్యార్థులు లేక కొన్నిచోట్ల మూత
- తాగునీటికీ ఇబ్బందులే


శిథిలావస్థకు చేరిన జగత్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

## మూత్రం వస్తే ఉగ్గబట్టాల్సిందే..

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలం మాలిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో 25 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో మూత్రశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలల్లో నీటి సౌకర్యం కూడా లేదు.


మాలిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరిన మూత్రశాలలు

## మూడు తరగతులు.. ఆరుగురు విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జగత్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 3వ తరగతి వరకు ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ పాఠశాల భవనం 15 ఏళ్లుగా పడావుగా ఉండి. తలుపులు, కిటికీలు విరిగి శిథిలావస్థకు చేరింది. దాంతో గ్రామంలోని యువజన సంఘం భవనంలో తాత్కాలిక తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం గ్రామంలో బడిబాట, గ్రామసభ పెట్టి బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, తాము సైతం ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన చేస్తామని చెప్పినా ఒక్కరూ కూడా చేరలేదు. గత సంవత్సరంలో వచ్చిన ఆరుగురు విద్యార్థులు పైతరగతికి వచ్చారు. 1వ తరగతిలో ఇద్దరు, రెండో తరగతిలో ఒక్కరు, మూడో తరగతిలో ముగ్గురు చొప్పున విద్యార్థులు ఉన్నారు.


కనీస సౌకర్యాలు లేక నేలపైనే బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

## వసతులు, విద్యార్థులూ.. అరకొరే


గుంటిపల్లి పాఠశాలలో ఐదు తరగతులకు హాజరైన ఆరుగురు విద్యార్థులు

నిడమనూరు : నిడమనూరు మండలంలోని పలు పాఠశాలల్లో అరకొర వసతులు ఉన్నాయి.. విద్యార్థులు కూడా తక్కువ సంఖ్యలోనే ఉన్నారు. 33 ప్రాథమిక పాఠశాలల్లో 896 మంది విద్యార్థులు ఉన్నారు. ఆరుచోట్ల విద్యార్థుల సంఖ్య సున్నాకు చేరింది. గగినపల్లివారిగూడెం, రాజన్నగూడెం, కుంటిగొర్లగూడెం గ్రామాల్లో పదికంటే తక్కువ మంది ఉన్నారు. వేంపాడు పాఠశాలలో 26 మంది విద్యార్థులు ఉండగా, ఒక్క ఉపాధ్యాయురాలే ఈరోజు విధులకు హాజరయ్యారు. ఎర్రబెల్లి పాఠశాలలో 68 మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండగా ఈరోజు ఇద్దరే హాజరయ్యారు. గుంటిపల్లి పాఠశాలో ఐదు తరగతులకు ఆరుగురు విద్యార్థులు హాజరయ్యారు.

## శిథిలమైన మూత్రశాలలు

మోత్కూరు : మోత్కూరు మండలం దత్తప్పగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ విద్యార్థులకు ప్రమాదకంగా మారింది. 6 నుండి 10వ తరగతి వరకు 54 మంది విద్యార్థులు ఉన్నారు. 8 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ పాఠశాలలో మూత్రశాలలు శిథిలమయ్యాయి. దీంతో బాలురు పాఠశాల చెరువులో ఉన్న చెట్ల మాటున మూత్ర విసర్జనకు వెళతారు. స్పెషల్ డెవలప్‌మెంట్ కింద రూ.8 లక్షలు మరుగుదొడ్ల నిర్మాణానికి మంజూరు చేశారు. గత సంవత్సరం కాంట్రాక్టర్ టాయిలెట్స్ నిర్మాణం కోసం పునాది గుంతలు తవ్వి అర్ధాంతరంగా వదిలేశారు.


దత్తప్పగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిథిలమైన టాయిలెట్స్.

## కురుస్తున్న తరగతి గది స్లాబ్

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని సీతారాంపురం(షాబునగర్) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు టీచర్లు ఉండగా 16మంది పిల్లలున్నారు. ఆ పాఠశాలలో రెండు గదులతో పాటు ఒక ఆఫీస్ ఉంది. అయితే వర్షం వచ్చిందంటే స్లాబ్ నుంచి వర్షపు నీరు గోడల వెంట తరగతి గదుల్లోకి చేరుతుంది. ఆ పాఠశాలలో మంచినీటి సమస్య, మూత్రశాలలు, మరుగుదోడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద వర్షం వచ్చిందంటే మాత్రం ఈ పాఠశాల చుట్టూ వర్షపునీటితో కమ్ముకుంటుంది.


సీతారాపురం ప్రాథమిక పాఠశాలలో గోడల నుంచి వస్తున్న వర్షపునీరు

## రైతు వేదికలో తరగతుల నిర్వహణ


దిర్శనపల్లి రైతు వేదికలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

నూతనకల్: మండల పరిధిలోని దిర్శనపల్లి ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాలలో నూతన తరగతి గదుల నిర్మాణాల కోసం అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకపోవడంతో అదే గ్రామంలోని రైతు వేదికలో తరగతులను నిర్వహిస్తున్నారు. రైతుల అవసరాల కోసం నిర్మించిన రైతు వేదిక పాఠశాలగా మారడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

## తరగతి గదులు సరిపడా లేవు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలో సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ పాఠశాలలో 6 నుండి 10వ తరగతి దాదాపు 300 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి మొత్తం 10 తరగతి గదులు అవసరం కాగా 8 తరగతి గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో వరండాలో ఒక తరగతిని, డైనింగ్ హాల్లో మరో తరగతి వారిని కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. ఇదే పాఠశాల అవరణలో మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే 4 తరగతి గదులు ఉన్నాయి. వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. పూర్తిగా శిథిలావస్థకు చేరి పైకప్పు, గోడలు కూలిపోతున్న గదులు 8 వరకు ఉన్నాయి. వీటిని పూర్తిగా తొలగించకపోవడం వల్ల ఆ పాఠశాల ఆవరణలో పాములు, విష పురుగులు సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు.


శిథిలావస్థకుచేరి కూలిపోతున్న గదులు


మరమ్మతులకు నోచుకోని గదులు


పెచ్చులు ఊడుతున్న తరగతిగది పైకప్పు


శేరిగూడెం పాఠశాలలో విధుల్లో ఉన్న ఉపాధ్యాయుడు

## విధుల్లో టీచర్.. కనిపించని పిల్లలు

గట్టుప్పల్ : గట్టుప్పల్ మండలం శేరిగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు రావడం లేదు. ఇక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయుడు నిత్యం విధులకు హాజరై సమయం ముగిశాక ఇంటికి వెళ్తున్నారు. ఐదారేళ్లుగా విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ప్రయత్నం చేయడం.. విద్యార్థులు రాకపోవడంతో ఇక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలకు పంపుతున్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించమని వేడుకున్నా తల్లితండ్రులు మాత్రం వినడం లేదని ఉపాధ్యాయుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

## శిథిలావస్థలో చెరువు అన్నారం పాఠశాల

కట్టంగూర్ : మండలంలోని చెరువుఅన్నారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శిథిలాస్థలో ఉన్న భవనంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సరిపడా తరగతి గదులు లేక ప్రధానోపాధ్యాయుడి గదిలో కూడా పాఠాలు బోధిస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితమే భవనం కూల్చాలని ఆదేశాలు వచ్చినా నేటికీ కూల్చలేదు. పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న 5 తరగతి గదులు స్లాబ్, గోడలు పూర్తయ్యాయి. నేటికీ ఒక్క రూపాయి కూడా బిల్లు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశాడు.


శిథిలావస్థలో ఉన్న చెరువుఅన్నారం ప్రాథమిక పాఠశాల

**విద్యార్థులు తక్కువ ఉపాధ్యాయులు ఎక్కువ**

చెరువు అన్నారం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, ఆరుగురు ఉపాధ్యాయులతో కలిసి మొత్తం ఏడుగురు సిబ్బంది ఉన్నారు. పాఠశాలలో 68 విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా అదనంగా ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు.

## అసంపూర్తి భవనాల్లోనే చదువులు

గుర్రంపోడు : మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పూర్వకాలం నాటి భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించాలని తలపెట్టారు. ఈ మేరకు పాఠశాల పాత గదులను కూలగొట్టి నూతనంగా నిర్మాణాన్ని చేపట్టారు. స్లాబ్ వేసినా పైసా బిల్లు అందకపోవడంతో కంట్రాక్టరు నిర్మాణాన్ని నిలిపివేశాడు. ఇంతలో ప్రభుత్వం మారడంతో మన ఊరు– మన బడి పథకాన్ని పక్కకు పెట్టారు. దీంతో రెండేళ్లుగా భవన నిర్మాణం స్లాబ్ దశలోనే నిలిచిపోగా తరగతి గదులు లేక గోడలు లేని స్లాబ్ క్రిందనే తరగతి గదిని నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో ముగ్గురు టీచర్లు, 30 మంది విద్యార్థులు ఉన్నారు. కట్టవారిగూడెం ప్రాథమిక పాఠశాలలోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ కూడ ఉన్న తరగతి గదిని కూల్చివేసి కొత్త గది నిర్మాణం చేపట్టగా స్లాబ్ వేసిన కంట్రాక్టరుకు బిల్లులు రాక అంపూర్తిగా వదిలేశాడు.


గుర్రంపోడులో రెండేళ్లుగా అసంపూర్తిగా నిలిచిన గోడలు లేని భవనంలోనే పాఠాలు

## టీచర్ ఒక్కరే.. విద్యార్థులు లేరు

ఆలేరురూరల్ : ఆలేరు మండలం గుండ్లెగుడెం గ్రామంలో ప్రభుత్వ పాథమిక పాఠశాలలో 2013 సంవత్సరంలో ఐదుగురు విద్యార్థులు మాత్రమే ఉండగా వారు వెళ్లిపోవడంతో ప్రాథమిక పాఠశాల మూతపడింది. తిరిగి 2018 సంత్సరంలో ప్రారంభించి ఒక ఉపాధ్యాయురాలిని నియమించారు. గత ఏడు సంవత్సరాలుగా ఒక్క విద్యార్థి కూడా బడిలో చేరలేదు. ఒక్క టీచర్ మాత్రమే స్కూల్‌కు హాజరవుతున్నారు. ఇంటింటికి తిరిగి బడిలో చేరమని చెప్పినా పిల్లలను తల్లిదండ్రులు చేర్పించడం లేదు. ఆలేరు పట్టణం పక్కనే ఉండడంతో దాదాపు 50 మంది పైనే పిల్లలు ప్రైవేట్ స్కూల్‌కు వెళ్తున్నారు.


గుండ్లెగుడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా కూర్చున్న ఉపాధ్యాయురాలు

## ఒకే గదిలో ఐదు తరగతులు

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలంలో బాకిగూడెం, బెండల్‌పహాడ్, జువ్విగూడెం పాఠశాలలో విద్యార్థులు లేరు. ఉపాధ్యాయులు మాత్రమే పాఠశాలకు వస్తున్నారు, నక్కలపల్లి హైస్కూల్‌లో బాలికలకు బాత్‌రూమ్‌లు సక్రమంగా లేవు. మండల కేంద్రంలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలల్లో కేవలం ఒక గది మాత్రమే ఉంది. ఆ గదిలోనే ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో 47 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. కొందరికి చెట్లకిందనే పాఠాలు చెబుతున్నారు. నూతన భవనం మంజూరైనా పనులు చేపట్టలేదు. పాఠశాలలో బాత్‌రూమ్‌లకు డోర్లు లేకపోవడంతో టీచర్‌లు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.


ఒక గదిలోనే తరగతులు నిర్వహిస్తున్న టీచర్‌లు

## ఒక్కరే టీచర్.. నలుగురు విద్యార్థులు

యాదగిరిగుట్ట: మండలంలోని మహబూబ్‌పేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఒక్కరే మహిళా టీచర్ ఉన్నారు. ఈ పాఠశాలలో గురువారం నలుగురు విద్యార్థులు మాత్రమే పాఠశాలకు హాజరయ్యారు. మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు ఉండగా నలుగురు పాఠశాలకు రావడం లేదు. ఒకే టీచర్ అన్ని తరగతులకు బోధిస్తోంది. గతంలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా, ఒకరు ఉద్యోగ విరమణ చేసి వెళ్లిపోయారు.


మహబూబ్‌పేట గ్రామంలో నలుగురు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న టీచర్

**బాత్రూమ్‌లు లేక అవస్థలు:** మండలంలోని మర్రిగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, 11 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు బాత్రూమ్‌లు లేక అవస్థలు పడుతున్నారు. ఒకే ఒక బాత్రూమ్ మాత్రమే ఉంది. ఈ బాత్రూమ్ కేవలం అమ్మాయిలకు మాత్రమే ఉంది.

## విద్యార్థులు చేరలే..

నకిరేకల్ : నకిరేకల్ మండలంలోని మండలాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరగలేదు. ఏడు తరగతులకు మొత్తం 20మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలో సౌకర్యాలు కూడా అరకొరగా ఉన్నాయి. వంటగది రేకులను కోతులు ధ్వంసం చేశారు. దీంతో ఎండలోనే భోజనం వండుతున్నారు. తాగునీరు కూడా లేక విద్యార్థులు ఇంటి నుంచే బాటిల్ తెచ్చుకుంటున్నారు. ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించి విద్యార్థులు పాఠశాలలో చేరలేదు.


మండలాపురం పాఠశాలలో కొద్దిమంది విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

## శిథిలమైన గదులు

అడ్డగూడూరు : అడ్డగూడూరు మండలంలోని మానాయికుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు ఉండగా.. 20 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్ల ఉన్నారు. మెత్తం మూడు గదులకు గాను ఒక గది పూర్తిగా శిథిలమై నిరుపయోగంగా ఉంది. మరో రేకుల గది కుడా శిథిలావస్థకు చేరింది. మిగిలింది ఒక్క గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు.


మానాయికుంటలో శిథిలావస్థకు చేరిన పాఠశాల గది

## ఒక్కడే సారూ.. ఒక్కరూ లేరు..

చందంపేట : చందంపేట మండలంలోని మోత్యతండాలోని ప్రాథమిక పాఠశాలలో ఒక్క ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నాడు.. విద్యార్థులు మాత్రం ఒక్కరు కూడా లేరు. గతంలో ఈ పాఠశాల మూతపడగా.. విద్యార్థులను మళ్లీ పాఠశాలకు రప్పించాలనే ఉద్దేశంతో పాఠశాలను పునః ప్రారంభించారు. అయినప్పటికీ ఒక్క విద్యార్థి కూడా పాఠశాలలో చేరలేదు.


మోత్యతండాలోని ప్రాథమిక పాఠశాల, ఉపాధ్యాయుడు శ్రీనివాస్

## 16 పాఠశాలలు మూత

పెద్దవూర: మండలంలో విద్యార్థులు లేరనే కారణంతో గత విద్యా సంవత్సరం 18 పాఠశాలలు మూతపడగా ప్రస్తుత విద్యాసంవత్సరంలో 16 పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శూన్యం. ఇందులో 11 గిరిజన తండాలలోని ప్రాథమిక పాఠశాలలే ఉండటం గమనార్హం. మండలంలో మొత్తం 47 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 11 ప్రాథమికోన్నత పాఠశాలలు, 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

**మూతబడిన పాఠశాలలు ఇవే..**

ఎంపీపీఎస్ గేమ్యానాయక్‌తండా, పాత జయరాంతండా, కొత్త జయరాంతండా, జగ్రాంతండా, మల్లేవానికుంటతండా, లింగంపల్లి, కొత్త జయరాంతండా, రామన్నగూడెంతండా, చింతపల్లితండా, జీపీఎస్ లేబర్ కాలనీ పైలాన్, సుద్దబావితండా, నాయినివానికుంట తండా, నాయినివానికుంట, రామన్నగూడెం, కోమటికుంటతండా, పాత జయరాంతండా ప్రాథమిక పాఠశాలలతో పాటు యూపీఎస్ కెనాల్ ఉర్దూ మీడియం, యూపీఎస్ కెనాల్స్ తెలుగు మీడియం పాఠశాలలు మూత బడ్డాయి. మూత పడిన పాఠశాలు మొత్తం 16 ఉండగా ఇందులో గిరిజన తండాలలో మూతపడినవి 11 ఉండటం గమనార్హం. దీంతో గిరిజన తండాలలలో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో 18 పాఠశాలలు మూతపడగా ఈ ఏడాది మర్రిపురి, సుద్దబావితండా ప్రాథమిక పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి.


పెద్దవూర: విద్యార్థులు లేక మూతబడిన నాయినివానికుంటతండా పాఠశాల

## 38మందికి రెండు గదులు మాత్రమే..

బొమ్మలరామారం: మండలంలోని తిర్మలగిరి ప్రాథమిక పాఠశాలలో 5 తరగతుల్లో 38 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ కలిసి రెండు గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో రెండు గదుల్లోనే ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులకు స్టాఫ్‌రూం లేక ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా మైసిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు, ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వీరిలో 1వ తరగతిలో నలుగురు, మూడో తరగతిలో ఇద్దరు, నాల్గో తరగతిలో ఒక విద్యార్థి ఉన్నారు. రెండు, ఐదు తరగతుల్లో విద్యార్థులులేరు.


తిర్మలగిరి ప్రాథమిక పాఠశాలలో ఒకే గదిలో కూర్చున్న మూడు తరగతుల విద్యార్థులు

## అయిదు తరగతులకు ఇద్దరే ఉపాధ్యాయులు


ఒకటవ, రెండవ తరగతి విద్యార్థులకు కలిపి బోధిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం కూరెల్ల ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు మొత్తం 40 మంది విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ఇద్దరు ఉపాధ్యాయులు అయిదు తరగతులను బోధించాల్సి ఉంది. ఒక గదిలో రెండు తరగతులకు చెందిన విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. ఒక తరగతి విద్యార్థులకు ఒక రోజు.. మరుసటి రోజు మరో తరగతి విద్యార్థులకు బోధన చేస్తున్నారు.

## కనీస సౌకర్యాలు కరువు

నాగారం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఈ పాఠశాలలో 65 మంది విద్యార్థులు ఉండగా.. ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఉపాధ్యాయులే మినరల్ వాటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఐదారేళ్ల కిత్రం వంట గది నిర్మాణానికి శంకుస్థాపన చేసి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేశాడు. దీంతో ఒక తరగతి గదిని వంట కోసం కేటాయించారు. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరి నిరూపయోగంగా మారాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


నాగారంలోని ప్రాథమిక పాఠశాలలో వంట చేయడానికి కేటాయించిన తరగతి గది